క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసీ డిపో కార్యాలయంలో నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలు ఫోన్ ద్వారా అందించాలని ఆయన కోరారు. సెల్ నంబర్ 99592 26311ను సంప్రదించాలని సూచించారు.

నేడు వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లిలోని వాసవీమాత ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో ఆలయ కమిటీ, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఊరె జనార్దన్, కార్యదర్శి గౌరు వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు చేశామని, అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి కృషి



డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న యుగేంధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ సలహాదారుడు యుగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జెడ్పీటీసీ నిధులతో కొండమల్లేపల్లిలోని 8, 9, 10వ వార్డుల్లో సోమవారం చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుడిగ శంకర్‌గౌడ్, ఏఈ ధర్మేంద్ర, జవహర్‌లాల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ డబ్బులు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న బీఎల్‌ఓలు

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్‌లో ఉన్న బీఎల్ఓల డబ్బులను ఇవ్వాలని కోరుతూ సోమవారం మండల తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు బీఎల్ఓలు వినతిపత్రం అందజేశారు. 2019లో బీఎల్ఓ డ్యూటీలు చేసే వారికి రూ.6వేల చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని, 2022లో ఒక్కసారి మాత్రం రూ.4800 చెల్లించినట్లు తెలిపారు. ప్రతి విషయానికి బీఎల్ఓలను బాధ్యలను చేస్తున్నారన్నారు. బీఎల్ఓల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఎల్ఓలు బొంది పార్వతి, ప్రమీల, వాణి, గుత్తా రాణి, లక్ష్మి, రాజేశ్వరీ, విజయలక్ష్మి, లలిత, రజిత, పద్మ, రమాదేవి, శశికాంత, పార్వతమ్మ, స్వరాజ్యం పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే చేయాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రతి బీఎల్ఓ ఇంటింటికి తిరిగి ఓట్లు ఉన్నాయా లేవా అనే దానిపై ఇంటింటి సర్వే చేయాలని మండల తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు ఉన్నాయా.. లేవా .. లేకుండా కొత్త ఓటు నమోదు చేయించుకునేలా వివరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. డబుల్ ఓట్లు ఉంటే వెంటనే తొలగించాలని, ఒకే ఓటు ఒకే చోట ఉండాలన్నారు. ఎవరైనా చనిపోతే ఓటరు లిస్టల నుంచి తక్షణమే తొలగించాలన్నారు. ఓటరు నమోదు సమగ్రంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఆర్ఐ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ జానీ షరీఫ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత కమిటీ సభ్యులు

డిండి : మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఫాతిమాబేగం అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం డిండి యువత చేయూత కమిటీ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటి.కృష్ణ, పున్న దినేశ్, పున్న లక్ష్మణ్, కటికర్ల లింగమయ్య, ఖయ్యూం, సత్యనారాయణ, వేణు, బల్మూరి సైదులు పాల్గొన్నారు.

గుర్రంపోడులో కనీస వసతులు కరువు

- ప్రధాన సెంటర్‌లో నిర్మించని మరుగుదొడ్లు
- బస్టాప్ లేక ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలూ లేని దుస్థితి



బస్టాండ్ లేక రోడ్డు పక్కనే నిల్చున్న ప్రయాణికులు

గుర్రంపోడు : గుర్రంపోడు మండల కేంద్రంలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామీణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ- దేవరకొండ రహదారిపై గ్రామ ప్రధాన సెంటర్‌లో కనీసం బస్టాండ్ లేకపోవడంతోపాటు మల మూత్ర విసర్జనకు టాయిలెట్లు కూడా నిర్మించలేదు. దీంతో గ్రామాల నుంచి మండలకేంద్రానికి వచ్చే వారు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక.. మహిళలు చెప్పుకోలేనిది బాధను అనుభవిస్తున్నారు. మండలకేంద్రం జనాభా ఐదు వేలు కాగా రోజూ ప్రభుత్వ కార్యాలయాలకు, ఇతర పనుల నిమిత్తం మండలకేంద్రానికి రోజూ వందలాది మంది వచ్చివెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులు ఆగినప్పుడు మూత్ర విసర్జనకు బస్సు దిగిన ప్రయాణికులకు ఎక్కడకు వెళ్లాలో అర్థంకాని పరిస్థితి. అయితే స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణనే ఇటీవలి వరకు మలమూత్రవిసర్జకు వినియోగించేవారు. ఇటీవల రహదారి బంగ్లాకు గేటు పెట్టడంతోపాటు ఆవరణలో పల్లె పకృతి వనం ఏర్పాటు చేశారు. ఫలితంగా బస్సులు దిగిన వారితోపాటు స్థానిక వ్యాపారులకు విసర్జనకు చోటే కరువైంది. దీంతో కిలోమీటరు దూరం వరకు బైక్‌పై వెళ్లి గ్రామ శివారులో మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని వ్యాపారులు వాపోతున్నారు.

బస్‌స్టేషన్ నిర్మాణం జరిగేనా

మండలకేంద్రంలో బస్‌స్టేషన్ నిర్మాణాన్ని ఆర్‌అండ్‌బీ ఆవరణలో చేపడతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తూనే ఉన్నారు. ఆర్‌అండ్‌బీ ఆవరణ ముందుభాగంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో వారికి వెనుక వైపున పునరావాసం కల్పించి బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఉన్నా అది కార్యరూపం దాల్చలేదు. గతంలో వేసవిలో ఆర్టీసీ వారు తాత్కాలికంగా తడకలతో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అవికూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండ వేడిమికి బస్‌ల కోసం నిరీక్షించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్‌లు నిర్ణీత స్థలంలో నిలుపక పోవడంతో ప్రయాణికులకు ఉరుకులు, పరుగులు తప్పడం లేదు.

సంత రోజున మరిన్ని కష్టాలు

గుర్రంపోడులో ప్రతి ఆదివారం జరిగే సంత రోజున గ్రామాల నుంచి, వేరే ప్రాంతాల నుంచి తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదాలకు స్థానికంగా మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా రోడ్డుపైనే సంతలో కూర్చేనే వ్యాపారులు టాయిలెట్ కోసం రోడ్డు వెంట చాలా దూరం వెళ్తున్నారు. రహదారిబంగ్లా ఆవరణలో టాయిలెట్లు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

రోడ్డు విస్తరణ సరే.. డ్రెయినేజీలేవీ?

మండలకేంద్రంలోని ప్రధాన సెంటర్ నుంచి నాంపల్లి రోడ్డులో ప్రధాన రహదారి విస్తరణ జరిగినా ఇరువైపులా డ్రెయినేజీలను నిర్మించలేదు. దీంతో రోడ్డు ఎత్తు పెరిగి ఎగువ భాగంలోని మురికి నీరు, వరదనీరు రోడ్డు పక్కన వీధుల్లో నిలిచి ఇళ్లలోకి నీరు చేరే పరిస్థితి ఏర్పడింది. డ్రెయినేజీలు లేకుండా జరిగిన రోడ్డు విస్తరణతో ఈ రోడ్డులో వరదనీటి కష్టాలు మరింతగా పెరిగాయి. దీనికితోడు నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలు లేవు. ప్రధాన రహదారుల్లో డ్రెయినేజీలను నిర్మించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సులభ్‌కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి



మండలకేంద్రంలో సులభ్‌కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. టాయిలెట్ల నిర్మాణానికి మండలకేంద్రంలో రహదారి బంగ్లా ఆవరణను వినియోగించుకోవచ్చు. మండల అధికారులు, గ్రామ పంచాయతీ ఈ విషయంతో శ్రద్ధ వహించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.
– వనమాల కామేశ్వర్, గుర్రంపోడు

త్వరలో సులభ్‌కాంప్లెక్స్ ఏర్పాటు



మండలకేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రూ.5లక్షలు మంజూరయ్యాయి. సులభ్ కాంప్లెక్స్‌కు ఈ నిధులు సరిపోయేలా లేనందున మరిన్ని నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరాం. నిధులు మంజూరు కాగానే త్వరలో ఎంపిక చేసిన ఆర్‌అండ్‌బీ ఆవరణలో గేటు పక్కనే సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తాం.
– షేక్ మస్రత్ సయ్యద్‌మియా, సర్పంచ్ గుర్రంపోడు

కవులు, కళాకారులను ప్రోత్సహించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



దేవరకొండ : భక్తి గీతాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : కవులు, కళాకారులను గౌరవిస్తూ వారిని ప్రోత్సహించాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో పట్టణానికి చెందిన బండారు వనజకుమార్ రచించిన సంకీర్తనల భక్తి గీతాల పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కవులు, కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి వారిని అన్ని రకాలుగా ఆదుకుంటుందని అన్నారు. ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శించి పాటలు రాయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సాంస్కృతిక సాహితి సమాఖ్య అధ్యక్షులు వివి.రామారావు, కార్యదర్శి వనం చంద్రమౌళి, భాష్యం యాదమోహన్, డాక్టర్ బండారు సుజాత శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తన అమ్మమ్మ జర్పుల రుక్కమ్మ, తాత జర్పుల బిచ్యానాయక్ జ్ఞాపకార్థం దేవరకొండ మండల పరిధిలోని జర్పుల తండాలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక

చింతపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చాకలిశేరిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు మామిడి మల్లేశ్, మాజీ అధ్యక్షుడు పుప్పాల జంగయ్య, కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల మహేశ్‌తో పాటు 30 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో చేరిన వారిలో బూడిద శ్రీశైలం, బూడిద శ్రీను, ముచ్చర్ల వెంకన్న, ముచ్చర్ల శంకరయ్య, ముచ్చర్ల అంజయ్య, సత్యనారాయణతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ కంకణాల ప్రవీణవెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి మాస భాస్కర్, శ్రీశైలం, అండేకార్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆసరాగా 'బుసిరెడ్డి ఫౌండేషన్'



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్

హాలియా : బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ వైష్ణవి బిల్డర్స్ అధినేత కొంపెల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి సోమవారం అనుముల మండలంలోని హజారిగూడెం, మధారిగూడెం గ్రామాల్లో మృతిచెందిన నిరుపేద బాధిత కుటుంబాలకు ఆసరాగా ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మధారిగూడెం గ్రామానికి చెందిన మామిడి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి పాండురంగారెడ్డి రూ. 10వేలు, అదే విధంగా హజారిగూడెం గ్రామానికి చెందిన కొండేటి సైదులు కుటుం బానికి రూ. 10వేలు, పురం హరిత కుటుంబానికి రూ. 10వేలు, సంకటి పెద్ద మల్లయ్య కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుముల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, ఎస్ఆర్ఐ కొంపెల్లి శ్రీనివాస్, పెద్దవూర ఎంపీపీ గౌరవ సలహాదారు చెన్ను సుందర్‌రెడ్డి, తిరుమలగిరి వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, హజారిగూడెం సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, ఉప సర్పంచ్ జబీన్ జలీల్‌పాషా, కౌన్సిలర్లు రామకృష్ణ, ఆదాసు విక్రమ్, మోహన్‌నాయక్, నాయకులు పసుల ప్రసాద్, శ్రీనాథ్, శ్రీకాంత్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అనుముల మండలంలోని హజారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త, వైష్ణవి బిల్డర్స్ అధినేత కొంపెల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి సోమవారం రూ.1,05,116 లను విరాళంగా అందించారు. పేరూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ మొదటి ద్వారానికి అయ్యే ఖర్చునంతా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దాత పాండురంగారెడ్డిని ఆయా ఆలయాల కమిటీ సభ్యులు సత్కరించారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, పెద్దఅడిశర్లపల్లి జెడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఘనపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెనుకున్నారు. రైతులు నెల పదిహేను రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంచామని నేటికీ కొనుగోలు చేయలేదని వారు వాపోయారు. దీంతో పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్‌రెడ్డిని అడగగా మండలంలో ఇంకా సుమారు 70వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, లారీల కొరతతో కింత జాప్యం జరుగుతుంని తెలిపారు. దీంతో ఆమె జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. స్పందించిన డీఎస్‌వో మరో 5రోజుల్లో పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో 90శాతం పూర్తి ధాన్యం కొనుగోలు చేశామని అధికార పార్టీ నాయకలు చెబుతున్నారని కాని పెద్దఅడిశర్ల మండలంలో ఇంకా 40 శాతం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వెంటనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సతీష్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, రుక్మారెడ్డి, శ్రీరాం, పాండునాయక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట ద్వారా ఆలయానికి రూ.62,21,000 ఆదాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో వెలసిన శ్రీబంగారు మైసమ్మ తల్లి ఆలయం వద్ద వివిధ హక్కుల కోసం సోమవారం ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. రూ.62,21,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్‌లు తెలిపారు. కొబ్బరి కాయలను అమ్ముకోవడానికి రూ.15,21,000, దున్నపోతులను సేకరించడానిక రూ.31,50,000, పూలదండలు అమ్ముకోవడానికి రూ.1,74,000, కొబ్బరి చిప్పలు సేకరించడానికి రూ.2,76,000, తలనీలాలు సేకరించుకోవడానికి రూ.5,80,000, లడ్డూ ప్రసాదాలు అమ్ముకోవడానికి రూ.5,20,000 వచ్చిటన్లు తెలిపారు. దేవాదాయశాఖ మిర్యాలగూడ డివిజన్ ఇన్స్‌పెక్టర్ ఇ.రమేష్ పర్యవేక్షణలో జరిగిన వేలంలో జడ్పీటీసీ లలితహాతీరాంనాయక్, గ్రామ సర్పంచ్ మాలోతు జనార్దన్, ఎంపీటీసీ శారదపాచ్చునాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు కోట్యా, భీమనయాజ్, శంక్రియా, పూజారులు వెంకటేశ్వర్లు, రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు అండగా 1104 యూనియన్



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న సబ్‌డివిజన్ అధ్యక్షుడు టి. రఘుమోహన్‌రెడ్డి

గుర్రంపోడు : విద్యుత్‌కార్మికులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారంలో 1104 యూనియన్ ముందంజలో ఉందని యూనియన్ సబ్‌డివిజన్ అధ్యక్షుడు టి. రఘుమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో గుర్రంపోడు, నాంపల్లి, మర్రిగూడెం, చింతపల్లి మండల విద్యుత్ కార్మికులు ఏకగ్రీవంగా సబ్‌డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాడుతుందన్నారు. యూనియన్ జిల్లా నాయకులు జైపాల్‌రెడ్డి, వనిపాల్, శ్రీనివాస్‌లు, జంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అక్తర్, శంకర్, రఘు, జాల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



తిరుమలగిరి : రంగుండ్లలో రాంసింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భగత్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన సంగారెడ్డి డీఎస్పీ ఆంగోతు బాలాజీ నాయక్ తండ్రి ఆంగోతు రాంసింగ్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్ సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంసింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ లీలావతి కోట్యానాయక్, గ్రామస్తులు ఫకీర, సర్దార్, శ్రీరాములు, బిచ్చు, సీన, దీప్లా, రవి, బాలు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న సురేష్

కొండమల్లేపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లిలో సోమవారం నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బొడిగె సాంబశివగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ నాయకులు శివకార్ బాబులాల్, భరత్‌కుమార్, యాదగిరిగౌడ్, జితేందర్, శ్రీధర్, జహీర్, యాదయ్య, పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో బీజేపీ నాయకులు గోవర్ధన్, వెంకటేశ్వర్లు, యుగేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వేములపల్లి : తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ ప్రభారి గంగిడ ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండేటి సరిత, పెదమాం వెంకన్న,సీతారాంరెడ్డి, నాయకులు ఉన్నా రు.

డిండి : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కళ్యాణ్‌నాయక్ ఆ పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని కందుకూర్ గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, వినోద్ రాథోడ్, రామకృష్ణ ఉన్నారు.

ఉపాధి హామీలో కొత్త పనులు గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మీ

మిర్యాలగూడ : ఉపాధి హామీలో కొత్త పనులు గుర్తించి అంచానాలను తయారు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి రోజు 200 మంది కూలీలతో పని చేయించాలని, ఉపాధి హామీలో కొలత ప్రకారం కూలీలతో పనిచేయించాలన్నారు. గ్రీన్ ప్లాన్ ప్రకారం మొక్కలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. కంపోస్ట్ షెడ్‌లో వారం రోజుల్లో కంపోస్టును తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీల్లో శ్మశాన వాటికలను వాడుకలోకి తీసుకు రావాలన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణ స్థలాలను ఎంపిక చేసి అంచనాలను తయారు చేసి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ టీ.వీరారెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీఓ కళావతి, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఆలంపల్లి నర్సింహ

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం సహకరించాలని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టణంలో మిషన్ భగీరథ, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనుల కారణంగా ఏర్పడిన గుంతలు, లింక్ రోడ్ల మరమ్మతులకు గాను కేటాయించిన రూ.50లక్షల పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా వార్డు కౌన్సిలర్లు పలు సమస్యలను లేవనెత్తారు. పలు వార్డుల్లో పందుల సమస్యల జటిలంగా మారిందని పలువురు కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రహత్‌అలీ, కమిషనర్ వెంకటయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోటిరెడ్డికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

హాలియా : అనుముల మండలం హజారిగూడెం గ్రామంలోని జూన్ 3నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే శ్రీ భ్రమరాంభ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయ పరివార దేవత, శిఖర, ధ్వజ, దివ్య ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్సీ కోటిరెడ్డికి సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో హజారిగూడెం సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, ఉత్సవ కమిటీ సభ్యులు రాంబాబు, రామలింగయ్య, కాంసాని శ్రీనివాస్ ఉన్నారు.

సదుపాయాలు కల్పించాలి



గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు

నల్లగొండ టూటౌన్ : డీవీకే రోడ్డులోని వినాయక హౌసింగ్‌బోర్డు కాలనీలో సీసీ రోడ్లు వేయాలని, పార్కులో మౌలిక సదుపాయాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో 350 నివాసాలు ఉన్నాయని, పార్కుకు కేటాయించిన రెండు ఎకరాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్వామిగౌడ్, రవీందర్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి

రామగిరి(నల్లగొండ) : మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 5 నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చినవారిలో తెలంగాణ ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ మంచినీటి పథకాల కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మనగోటి శ్రీనయ్య, బత్తుల వెంకటేశం, గట్టుపల్లి సంజీవరెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

నందికొండలో గాలివాన బీభత్సం



నాగార్జునసాగర్‌లో ఎదుట లేచిపోయిన రేకులు

నాగార్జునసాగర్ : నందికొండలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. హైలాన్ కాలనీలో ఇళ్లపై కప్పు రేకులు లేచిపోయి రోడ్డు మీద పడ్డాయి. మాచర్ల – సాగర్ రహదారి వెంట ఉన్న వైన్ షాపు ఎదుట వేసిన రేకులు గాలికి లేచి కప్పకులాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గ్రూప్-4 పరీక్ష కేంద్రాల పరిశీలన

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జూలై 1న నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్ష కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ సైదులు సోమవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు కావాల్సిన సౌకర్యాలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెదర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'ప్రజాగర్జన' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : జూన్ 4న భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా గర్జన బహిరంగ సభ ప్రచార పోస్టర్‌ను సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంజయ్య, రామలింగం, వెంకన్న, రాజేశ్వరీ తదితరులున్నారు.